

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన సి.యల్లారెడ్డి రూ.1,00,005 విరాళంగా అందజేశారు.



కేసీకి నీటి విడుదల

గూడూరు : సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



కష్టపడ్డారు.. కొలువు సాధించారు

ఖాకీ చొక్కా ధరించి, తలపై టోపీ పెట్టుకుని, చేతిలో లాఠీ పట్టుకోవాలని కలలుగన్న కొందరు యువతీ, యువకులు ఎట్టకేలకు కొలువును చేజిక్కించుకున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

44 విలేజ్ ఇండస్ట్రీస్ ఏర్పాటు

- ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డీడీ హరికృష్ణ

కర్నూలు(అగ్రికల్చర్): నిరుద్యోగ యువత స్వయం ఉపాధిలో రాణించేందుకు వీలుగా ఉత్పత్తి రంగం (మాన్యుఫాక్చరింగ్), సేవా రంగం (సర్వీస్)లో వివిధ యూనిట్లు నెలకొల్పుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగా జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డీడీ హరికృష్ణ తెలిపారు. 2023–24 సంవత్సరంలో 68 యూనిట్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 44 యూనిట్లు మంజూరు చేయడంతో పాటు గ్రౌండింగ్ కూడా చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్పత్తి రంగంలో అంటే ఇటుకల తయారీ, జ్యూట్ బ్యాగ్‌లు, పేపర్ ప్లేట్స్ వంటి వాటిని నెలకొల్పుకోవడానికి గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. సేవా రంగం అంటే ఫొటో స్టుడియో, టెంట్ హౌస్ వంటి వాటికి గరిష్ఠంగా రూ. 20 లక్షలు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. విధిగా బ్యాంకు రుణం ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి 35 శాతం, పట్టణ ప్రాంతాల వారికి రూ.25 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 68 యూనిట్ ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 44 గ్రౌండ్ అయ్యాయని, మిగిలిన వాటికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో బ్యాంకులే కీలకమని వివరించారు.

హనుమద్వాహనంపై మద్దిలేటయ్య



హనుమద్వాహనంపై నారాయణుడి అలంకారంలో మద్దిలేటి స్వామి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ మద్దిలేటి నరసింహస్వామి నారాయణుడి అవతారంలో హనుమద్వాహనంపై ఆలయ పరిసరాల్లో విహరించారు. పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామసుబ్బమ్మ, సుశీల, లక్ష్మీదేవి, ఆకుల రమణ, మద్దయ్య, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 1 ,3, 5 సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి జనవరి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ రెగ్యులర్ 8,295, సప్లిమెంటరీ 9,426 మంది, మూడో సెమిస్టర్ రెగ్యులర్ 6,894 మంది, సప్లిమెంటరీ 10,310 మంది, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ 11,584 మంది, సప్లిమెంటరీ 4,654 మంది.. మొత్తం రెగ్యులర్ 26,773 మంది, సప్లిమెంటరీ 24,390 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

జిల్లా సమాఖ్య నూతన పాలకవర్గం ఏర్పాటు

- అధ్యక్షురాలిగా సీతాబాయి

కర్నూలు (అగ్రికల్చర్) : జిల్లా మహిళా సమాఖ్య పాలకవర్గం గురువారం ఏకగ్రీవంగా ఏర్పాటు అయింది. కర్నూలు శివారులోని డీఆర్‌డీఏలో జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాషా ఆధ్వర్యంలో పాలకవర్గం ఏర్పాటయ్యింది. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలుగా కె.సీతాబాయి (ఆలూరు), ఉపాధ్యక్షురాలుగా ఎస్.రజియా (గూడూరు), కార్యదర్శిగా వెంకటలక్ష్మి (హాలహర్వి), కోశాధికారిగా విజయలక్ష్మి (చిప్పగిరి), ఉప కార్యదర్శిగా భాగ్యలక్ష్మి (సి.బెళగల్) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ శ్రీధర్ రావు, ఫైనాన్స్ మేనేజర్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రైళ్లు రద్దు

కర్నూలు (రాజ్‌విహార్): కర్నూలు నుంచి కాచిగూడకు వెళ్లే మూడు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్స్ కారణాలతో కర్నూలు నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరే కాచిగూడ డెమో ఎక్స్‌ప్రెస్ (17436)తో పాటు ఉదయం 5:30 గంటలకు బయలుదేరే హంద్రీ ఎక్స్‌ప్రెస్ (17028) శుక్రవారం రద్దు చేశామని, సికింద్రాబాద్ నుంచి కర్నూలుకు వచ్చే రైలు (17027)ను గురువారం రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రయాణికులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వర్ధిల్లు వెయ్యేళ్లు.. జీవించు నూరేళ్లు

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సంబరాలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. ఊరూవాడా జగనన్న నినాదం హోరెత్తింది. ఓ వైపు కేక్ కటింగ్‌లు, క్షీరాభిషేకాలు, బైక్ ర్యాలీలతో అభిమానుల ఆనందం ఉప్పొంగింది. మరో వైపు రక్తదానం, వస్త్ర దానం, అన్నదాన కార్యక్రమాలతో సేవలు వెల్లివిరిశాయి. నవరత్నాలతో వెలుగులు నింపిన ప్రగతి ప్రదాతను దేవుడు దీవించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆలయాల్లో పూజలు చేశారు. జీవించు నూరేళ్లు.. వర్ధిల్లు వెయ్యేళ్లు.. అంటూ ప్రజానీకం జేజేలతో ఆశీర్వదించింది.

- జిల్లాలో ఘనంగా సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు
- సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన నేతలు
- రక్తదానం, అన్నదానం, దుస్తులు, దుప్పట్ల పంపిణీ
- కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్న నాయకులు, కార్యకర్తలు
- హ్యాపీబర్త్ డే జగనన్న అంటూ ర్యాలీలు

పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ బీవై రామయ్య, చిత్రంలో ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్ తదితరులు



కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పండుగలా నిర్వహించారు. సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. కర్నూలు మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం జగన్, వైఎస్ భారతీ దంపతుల భారీ కటౌట్ ఏర్పాటు చేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి ఆధ్వర్యంలో రాజ్‌విహార్ సర్కిల్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం, కేట్ కటింగ్ చేశారు. పార్టీ మాజీ నగర అధ్యక్షుడు రాజా విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాతబస్టాండ్ వద్ద అన్నదానం చేశారు. కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో కర్నూలు–1డిపో యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు.

➡ పాణ్యం నియోజకవర్గం కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య, డిప్యూటీ మేయర్ రేణుకారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

➡ ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున వేడుక నిర్వహించారు, ఎస్‌కేడీలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌తో కలిసి భారీ కేట్ కట్ చేశారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

➡ కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో కోడుమూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

➡ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సి.బెళగల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యకర్తలతో మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు.

➡ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి బనవాసి గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

➡ పత్తికొండలోని గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

➡ మంత్రాలయంలో ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలూరులో మంత్రి సోదరుడు నారాయణ స్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు.



మంత్రాలయంలో కేక్ కట్ చేసి విద్యార్థినికి తినిపిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



ఆదోనిలో కేక్ కట్ చేసి పార్టీ నాయకుడికి తినిపిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎ స్‌జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను 98 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట సంబరాలు జరిపారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేకును కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..1998 డీఎస్సీ అభ్యర్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో 4072 మందికి ఉద్యోగాలు ఇచ్చి 10 వేల మంది కుటుంబ సభ్యుల ఆదారాభిమానాలు పొందారన్నారు. తమ గుండెలో సీఎం వైఎస్ జగన్ కొలువై ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో రామకృష్ణ, రవీంద్రనాథ్‌రెడ్డి, కాశీంవలి, పురుషోత్తం, ఎం.శ్రీనివాస్, రఘురామయ్య, కృష్ణారెడ్డి, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో జనం సంతోషం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలతా సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా గురువారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్, పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య కేట్ కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా బీవై రామయ్య, కాటసాని మాట్లాడుతూ.. పేదల కష్టాలు తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండడం అభినందనీయమన్నారు. అధకారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత దేశంలో సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపిస్తే.. మరింత మంచి పాలన అందిస్తారని చెప్పారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. విద్య, వైద్య, ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చి, 4 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సత్యనారాయణమ్మ, పద్మలతారెడ్డి, సీహెచ్ మద్దయ్య, ఆదిమోహన్‌రెడ్డి, కర్నాటి పుల్లారెడ్డి, సుభాష్‌చంద్రబోస్, ధనుంజయ ఆచారి, బెల్లం మహేశ్వరరెడ్డి, ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, లక్ష్మీ కాంతయ్య, గోపాల్‌రెడ్డి, జిలానీ, జమీల, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న 98 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు



కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మేయర్ రామయ్య



రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



కోడుమూరులో రోగులకు బ్రెడ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్



పత్తికొండలో మహిళలకు కుట్టుమిషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

రేషన్ పంపిణీలో వలంటీర్లు పాల్గొనాలి

- ఎండీయూ వాహన సమాచారాన్ని కార్డుదారులకు చేర్చాలి
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఎండీయూ వాహనాల రాకపోకల సమయాన్ని వలంటీర్లు ప్రజలకు తెలియజేయాలని, లేకపోతే జియోట్యాగింగ్ లోకేషన్‌ను సర్చ్ చేసి సంబంధిత వలంటీర్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. గురువారం ఉదయం ఆమె జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎండీయూ వాహనాలు, ఆడుదాం ఆంధ్ర, రీసర్వేకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలా చోట్ల రేషన్ పంపిణీలో వలంటీర్లు పాల్గొనడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ క్రమంలో వలంటీర్లు రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు మూడో విడత రీసర్వేలో భాగంగా 160 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తి కావడంతో స్టోన్ ప్లాంటేషన్‌పై దృష్టిసారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆడుదాం-ఆంధ్ర క్రీడలకు సంబంధించి క్రీడాకారుల రిజిస్ట్రేషన్, గ్రూపుల ఏర్పాటు, ఆటస్థలాల గుర్తింపు, ఆటస్థలాల మ్యాపులు, షెడ్యూల్ తయారీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కౌతాళం మండలం ఎంపీడీఓ పనితీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడాకారుల రిజిస్ట్రేషన్‌లో కేవలం రెండు శాతమే పురోగతి కనిపించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ..ఎండీయూ వాహనాలు ఏ రోజు ఏ వీధిలో ఏ సమయంలో నిలుస్తాయో వలంటీర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇందుకోసం వలంటీర్లకు నెలకు రూ.750 అదనంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుందన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

విజయవాడకు వెళ్లిన కలెక్టర్ సృజన

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం విజయవాడ వెళ్లారు. ఈ నెల 22,23వ తేదీల్లో అక్కడ ఎన్నికల సంఘం నిర్వహించే సన్నాహక సమావేశంలో పాల్గొననున్నారు.

రేపు శ్రీశైలంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో ఈనెల 23న శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు గురువారం తెలిపారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వేకువజామున శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ఉత్తరద్వార దర్శనం, రావణవాహన సేవ గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే దర్శన ప్రారంభవేళల్లో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 3గంటలకు ఆలయ ద్వారాలను తెరచి మంగళవాయిద్యాల అనంతరం 3.30 గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు, 4.30 గంటలకు స్వామివారి, అమ్మవారికి మహామంగళహారతు లు జరిపించబడతాయన్నారు. స్వామివారి ఊరేగింపు ప్రారంభమైన తరువాత ఉదయం 6గంటల తరువాత భక్తులను ఆర్జితసేవలకు, సర్వదర్శనానికి అనుమతిస్తామని ఈఓ తెలిపారు.

ఆర్జిత అభిషేకాలు నిలుపుదల

శ్రీశైలదేవస్థానంలో ఈ నెల 23వ తేదిన వైకుంఠ ఏకాదశి, 24న ఆదివారం, 25న సోమవారం కావడంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో ఈ మూడు రోజులు గర్భాలయ, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేసినట్లు ఆలయాధికారులు తెలిపారు. కాగా ఈ రోజులలో రోజుకు నాలుగు విడుతలుగా స్పర్శదర్శనం కల్పించబడుతుందని, టిక్కెట్ ఆన్‌లైన్‌లో మాత్రమే పొందాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



అందుకున్న ట్యాబులను చూపిస్తున్న విద్యార్థులు

- జిల్లాలో 32,782 మందికి ట్యాబ్‌లు
- సీఎం బర్త్‌డే సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు అందజేత

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్య అందుతోందని కర్నూలు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం నగరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ.. మంచి విద్య మెరుగైన భవిష్యత్తుకు పునాది వంటిదన్నారు. విద్యార్థులు హుషారుగా పాఠశాలకు వచ్చేలా 1వ తరగతి నుంచి స్మార్ట్ టీవీ ద్వారా డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతి గదిలోను ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు డిజిటల్ విద్య అందుతుంటే.. పచ్చ మీడియా ట్యాబ్‌లపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 32,782 మంది ఉన్నారని, ఇందులో మొదటి విడతగా 25 మండలాల్లో 5,161 మందికి మొదటి రోజు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. ఒక్కో ట్యాబ్ ధర రూ.33 వేలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మీ, జిల్లా నోడల్ అధికారి వై.ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మిగనూరులో సామాజిక సాధికార యాత్ర

- హాజరుకానున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజాప్రతినిధులు
- ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బహిరంగ సభ



ఎమ్మిగనూరులో సామాజిక సాధికార సభ నిర్వహించనున్న ప్రాంతం

ఎమ్మిగనూరుటౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారిని ఆత్మీయంగా పలకరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శుక్రవారం ఎమ్మిగనూరుకు రానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగు నింపారు. ఆయా వర్గాల వారికి వివిధ పదవులు ఇచ్చి సమాజంలో గౌరవం కల్పించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని తరహాలో బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించి హామీలను పక్కాగా అమలు చేశారు. మంత్రి వర్గం మొదలుకొని ఎంపీటీసీ వరకు అన్నింటిలోనూ పెద్దపీట వేశారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్లుగా, డైరెక్టర్లుగా పదవులు ఇచ్చి చరిత్రలో నిలిచారు. అగ్రవర్ణాలతో సమానంగా అణగారిన వర్గాలు ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు కల్పించారు. ఆయా వర్గాలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నారు.

నేడు యాత్ర సాగుతుందిలా..

శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 3.40 గంటల వరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో వివిధ వర్గాల వారితో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3. 40 నుంచి సాయంత్రం 4గంటల వరకు విలేకరుల సమావేశం ఉంటుంది. సాయంత్రం 4 గంటల నుంచి బస్సుయాత్ర ప్రారంభమై.. ఎద్దుల మార్కెట్ నుంచి గంజిహళ్లి రోడ్డుమీదుగా సాయంత్రం 6.45 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకుంటుంది.

హాజరుకానున్న ప్రజాప్రతినిధులు

సామాజిక సాధికార బస్సు యాత్రలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, రాజ్యసభ సభ్యుడు బీదమస్తాన్‌రావు, ఎంపీలు గురుమూర్తి, డాక్టర్ సంజీవ్‌కుమార్, గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఉర్దు అకాడమీ చైర్మన్ నదీంలతో పాటు పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొననున్నారు.

విజయవంతం చేయండి



ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు అన్ని ఏర్పాట్లు చేశాం. బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో అవకాశాలు ఇచ్చారు. అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించారు. బస్సుయాత్రలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

– చెన్నకేశవరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే

క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. గురువారం ఆమె నిడ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో శారీరక వికలత్వం, మానసిక ఎదుగుదల లేని పిల్లలు జన్మిస్తారని తెలిపారు. బాలికల వివాహ వయస్సు 18 సంవత్సరాలుగా నిర్ణయించారన్నారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులు, పురోహితులపై బాల్యవివాహాల నిషేధిత చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తారన్నారు. చిన్నవయస్సులో పెళ్లి చేయడం వల్ల రక్తహీనతతో ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణానికి చెందిన పఠాన్ నబీ ఖాన్ అనే రౌడీ షీటర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు గురువారం ఆత్మకూరు సీఐ ఎం. నాగభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రౌడీషీటర్‌పై ఇప్పటి వరకు ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో 21 కేసులు నమోదు కాగా అందులో ఫోక్సో యాక్ట్ కేసు 1, ఎస్సీ, ఎస్టీ కేసులు 3, చోరీ కేసులు 10, హత్యాయత్నం కేసులు 2, దోపిడీ కేసు 1, గలాటా కేసులు 4 నమోదైనట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న రౌడీషీటర్‌పై కలెక్టర్ మనజీర్ జిలానీ ఆదేశాల మేరకు పీడీయాక్ట్ కేసు నమోదు చేసి కడప సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు తెలిపారు.

గంజాయి విక్రేతపై..

బొమ్మలసత్రం: పట్టణంలో గంజాయి రవాణాతో పాటు విక్రయాలకు పాల్పడుతున్న మహిళపై జిల్లా ఎస్పీ కే రఘువీర్‌రెడ్డి గురువారం పీడీయాక్ట్ నమోదు చేశారు. స్థానిక నూనెపల్లి వీధికి చెందిన సీతమ్మపై గతంలో ఐదు గంజాయి కేసులు నమోదయ్యాయి. ఈక్రమంలో జైలు శిక్ష అనుభవించి వచ్చినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు.

హిజ్రాల మధ్య ఘర్షణ



ఘర్షణకు గల కారణాలపై ఆరా తీస్తున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

పాణ్యం: స్థానిక బీసీ కాలనీలో హిజ్రాల మధ్య ఘర్షణ తలెత్తింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల నుంచి ప్రారంభమైన వివాదం గురువారం ఉదయం 11గంటల వరకు కొనసాగింది. ఒక వర్గంపై మరొక వర్గం వారు రాళ్లు, పెట్రోల్ పోసిన బాటిళ్లతో దాడి చేసుకున్నారు. అలాగే ఇంట్లో ఉన్న దుస్తులను కాల్చి మరో వర్గంపై వేశారు. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. హిజ్రాలు స్పీడ్ బ్రేకల వద్ద వేర్వేరు గ్రూప్‌లుగా డబ్బులు వసూలు చేసుకుంటున్నారు. గత కొంత కాలంగా వీరి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. బుధవారం అర్ధరాత్రి వేళ హిజ్రాల మధ్య హద్దుల విషయంలో వివాదం చెలరేగి దాడులు చేసుకున్నారు. దీంతో చుట్టుపక్కల ప్రజలను భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు ఇరు వర్గాల వారిని చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ఘర్షణకు కారణమైన వారిపై కేసు నమోదు చేశామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

హిజ్రాలకు 14రోజుల రిమాండ్

పాణ్యం బీసీ కాలనీలో జరిగిన ఘర్షణకు కారణమైన నిందితులకు కోర్టు 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. న్యాయస్థానం సూచనల మేరకు నిందితులను కడప ప్రత్యేక జైలుకు తరలించినట్లు చెప్పారు.

కష్టపడ్డారు.. ఎస్ఐ కొలువు సాధించారు

- ఎస్ఐ ఫలితాల్లో జిల్లా యువతీ, యువకుల ప్రతిభ
- రాయలసీమ జోన్‌లో ఆళ్లగడ్డ వాసికి ప్రథమ ర్యాంక్
- ప్రతిభ చాటిన పేదింటి బిడ్డలు



కర్నూలు (సిటీ): ఖాకీ చొక్కా ధరించి, తలపై టోపీ పెట్టుకుని, చేతిలో లాఠీ పట్టుకోవాలని ఎంతో మంది యువత కలలు కన్నారు. రాత్రి, పగలు కష్టపడి చదివి తాము కలలుగన్న కొలువును చేజిక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలోని సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాళీలను భర్తీ చేసేందుకు గత ఏడాది నవంబర్ 5వ తేదీన నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాయలసీమ రేంజ్ పరిధిలోని 105 ఎస్ఐ పోస్టుల కోసం 19,800 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరందరికీ ఈ ఏడాది ఫిబ్రవరి 18, 19 తేదీల్లో కర్నూలులో 39 కేంద్రాల్లో ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత పొందిన 16,108 మంది అభ్యర్థులకు ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు పీఈటీ, పీఎంటీ టెస్టులను నిర్వహించారు. ఇందులో అర్హత పొందిన 8,521 మంది మెయిన్స్‌కు అర్హత పొందారు. వీరందరికీ అక్టోబర్ 14, 15 తేదీల్లో 14 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష ఫలితాలను ఈనెల మొదటి వారంలో విడుదల చేశారు. ఇందులో మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలకు ఎంపికైనవారి జాబితాను గురువారం విడుదల చేశారు. ఇందులో జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఉద్యోగం చేస్తూనే..



ఎస్ఐగా ఎంపికైన రాజశేఖర్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు సోమేష్, లక్ష్మీదేవి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం –2లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న రాజశేఖర్ ఎస్ఐగా ఎంపిక అయ్యారు. ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ రాత పరీక్షల ఫలితాలలో 240 మార్కులతో సివిల్ ఎస్ఐగా ఎంపిక కావడంతో సహచర ఉద్యోగులు, మండల అధికారులు, వలంటీర్లు రాజశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్నారు. గూడూరు మండలం చనుగండ్ల గ్రామానికి చెందిన జులుగారి సోమేష్, లక్ష్మీదేవి దంపతులు కుమారుడు రాజశేఖర్ మండలంలోని ఇనగండ్ల గ్రామ సచివాలయంలో 2019 అక్టోబర్ నెలలో గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శి విధులలో చేరారు. ఈ ఏడాది సి.బెళగల్ గ్రామ సచివాలయం –2కు బదిలీ అయ్యారు. కాగా తమ కుమారుడు ఎస్ఐ ఉద్యోగం పొందటంపై తల్లిదండ్రులు జులుగారి సోమేష్, లక్ష్మీదేవి స్వీట్ తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు.

శభాష్.. మల్లికార్జున



మల్లికార్జున

ఆదోని సెంట్రల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో సిగ్నల్ అపరేటర్‌గా పనిచేస్తున్న మల్లికార్జున ఎస్ఐ రాత పరీక్షలో విజయం సాధించాడు. సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. అనంతపురం జిల్లా పామిడి మండలం కట్టకంతపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. అదే సంవత్సరం రైల్వే సిగ్నల్ అపరేటర్‌గా ఉద్యోగం రావడంతో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. రైల్వే సిగ్నల్ అపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఎస్ఐ పరీక్షలు రాసి విజయం సాధించాడు. తన తండ్రి సలా రామకృష్ణ, తల్లి పద్మావతి వ్యవసాయ పనులు చేస్తూ తనను చదివించారని మల్లికార్జున తెలిపారు.

కల నెరవేరింది



కుడుముల క్రాంతికుమార్

తుగ్గలి: ఎస్ఐ కావాలనే కలను మండల పరిధిలోని రామకొండ గ్రామానికి చెందిన కుడుముల క్రాంతి కుమార్ నెరవేర్చుకున్నారు. తల్లిదండ్రులు ప్రసాద్, పార్వతి వ్యవసాయ పనులు చేస్తూ కుమారున్ని బీటెక్ వరకు చదివించారు. మొదట 2017లో విజయవాడ సిటీ యూనియన్ బ్యాంకులో క్లర్క్‌గా పనిచేశాడు. పోలీస్ శాఖలో కొలువు సాధించాలనే బలమైన కోరికతో రెండు నెలల 15రోజులకే ఉద్యోగానికి రాజీనామా చేశాడు. 2018, 2019లో పరీక్ష రాసినా ఉద్యోగం సాధించలేకపోయాడు. పట్టుదలతో చదివి 2023లో ఉద్యోగం సాధించాడు. తన తమ్ముడు రాము కాన్పూర్ ఐఐటీలో చదివి ఉద్యోగం చేస్తున్నాడని, తల్లిదండ్రుల సహకారంతో తన కలను నెరవేర్చుకున్నట్లు క్రాంతికుమార్ తెలిపారు.

రాయలసీమ జోన్‌లో ప్రథమ ర్యాంకు

- ఆళ్లగడ్డ యువకుడి ప్రతిభ



శివనాగిరెడ్డి

ఆళ్లగడ్డ: ఎస్ఐ ఫలితాల్లో ఆళ్లగడ్డ యువకుడు సత్తా చాటాడు. రాష్ట్ర వ్యాప్తంగా 5వ ర్యాంక్, రాయలసీమ జోన్‌లో ప్రథమ ర్యాంక్ సాధించాడు. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన అంకిరెడ్డి కుమారుడు శివనాగిరెడ్డి ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ మీడియట్ వరకు ఆళ్లగడ్డలో విద్యనభ్యసించాడు. డిగ్రీ కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాలలో పూర్తి చేశాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇతను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ నియామక ఫలితాల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో ఐదోర్యాంకు, రాయలసీమ జోన్‌లో ప్రథమ ర్యాంకు సాధించాడు. కష్టపడి విజయం సాధించిన యువకుడిని చూసి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించడమేగాక.. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతానని తెలిపారు.

మధ్యాహ్న భోజనం కార్మికురాలి కుమారుడు..



కుటుంబ సభ్యులతో కె.సాయికుమార్

కర్నూలు నగరానికి చెందిన కె.మల్లికార్జున, కె.పద్మావతి దంపతుల కుమారుడు కె.సాయికుమార్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రాథమిక విద్య కల్లూరులోని జ్యోతి ప్రియాంక స్కూల్‌లో, 6 నుంచి 10వ తరగతి వరకు కల్లూరు జెడ్పీ హైస్కూల్, ఇంటర్మీడియట్ సీవీ రామన్ జూనియర్ కాలేజ్‌లో చదివి జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్‌లో 2019లో బీటెక్ పూర్తి చేశారు. తన స్నేహితులు డిగ్రీ పూర్తయిన తర్వాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేవారు. వారిని చూసి చదువుతూ ఈ ఏడాది మే నెలలో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. తండ్రి మరణించినా తల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా పనిచేస్తూ ఎంతో కష్టపడి తనను చదివించారని సాయికుమార్ తెలిపారు. తన చిన్నతనంలో తనను పోలీసుగా చూడాలని తాత నాగముని కోరేవారని, ఎట్టకేలకు ఎస్ఐ ఉద్యోగం సాధించి మా తాత కలను నెరవేర్చానని సంతోషం వ్యక్తం చేశారు.

వి'జయశ్రీ'



జయశ్రీ

నందవరం: మండలంలోని ముగతి గ్రామానికి చెందిన బోయ జయశ్రీ ఎస్ఐ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్ఐగా ఎంపికయ్యారు. గ్రామంలోని నరసింహులు, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. అందులో పెద్దకుమార్తె ధనలక్ష్మి, రెండో కుమార్తె జయశ్రీ, మూడవ వాడు విజయ్. రెండో కుమార్తెన జయశ్రీ డిగ్రీ పూర్తి చేసి ఎస్ఐ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నారు. గత ఏడాది నవంబరులో ప్రభుత్వం కానిస్టేబుల్స్, ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది అక్టోబరు 14, 15వ తేదీల్లో పరీక్ష రాయగా.. గురువారం రాత్రి విడుదలైన జాబితాలో జయశ్రీ ఉతీర్ణత సాధించి ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యారు. గ్రామంలో మొదటి మహిళగా ఎస్ఐ పోస్టుకు ఎంపికైనందుకు జయశ్రీకి గ్రామ పెద్దలు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

తిమ్మనాయినపేట యువకుడి ప్రతిభ



చిన్న దస్తగిరి

కొలిమిగుండ్ల: రైతు కుటుంబానికి చెందిన ఓ యువకుడు ఎస్ఐ రాత పరీక్షల్లో విజయం సాధించాడు. మండల పరిధిలోని తిమ్మనాయినపేటకు చెందిన ఎగ్గోని పాపా సాహెబ్, మాబీ దంపతుల కుమారుడు చిన్న దస్తగిరి 2019లో బీటెక్ పూర్తి చేశాడు. ఎస్ఐ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. 2020లో హైదరాబాద్‌లో యూనిక్ అకాడమిలో కోచింగ్ తీసుకునేవాడు. కరోనా కారణంగా ఇంటి వద్ద వ్యవసాయం చేసుకుంటూనే మరో పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. 2022 నుంచి కర్నూలులో కోచింగ్ తీసుకుంటూ వచ్చాడు. ఎట్టకేలకు అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే తాను ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాయని చిన్న దస్తగిరి తెలిపారు.

ఆటోవాలా అయ్యాడు ఎస్ఐ



చిన్నరాయుడు

సి.బెళగల్: ఆటో నడుపుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్న మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు కష్టపడి చదివి ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించారు. సి.బెళగల్ మండలంలోని ఇనగండ్ల గ్రామంలో భగమంతు సోమేష్, ఈశ్వరమ్మ దంపతుల మొదటి కుమారుడు చిన్నరాయుడు కర్నూలు ప్రభుత్వ పురుషుల కళాశాలలో 2018లో బీకామ్ పూర్తి చేశారు. ఆ తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో చిన్నరాయుడు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేసుకునేవారు. 2021లో ఆటో కొనుగోలు చేసి దాదాపు రెండు సంవత్సరాల పాటు ఆటో నడుపుతూ కుటుంబానికి ఆసరాగా నిలిచారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం ఎస్ఐ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో కర్నూలు రూమ్‌లో ఉంటూ పోలీస్ ఉద్యోగానికి సిద్ధమవుతూ విజయాన్ని అందుకున్నారు. 'కుటుంబంలో ఆర్థిక కష్టాలు ఉన్నా అమ్మానాన్నతో పాటు చిన్నాన్న, చిన్నమ్మలు ఎంతో ప్రోత్సహించారు. ఎస్ఐ ఉద్యోగం సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉంది' అని చిన్నరాయుడు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హోంగార్డు కుమారుడు ఎస్ఐగా ఎంపిక



రేపల్లె కల్యాణ్

కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన రేపల్లె ఉమా బ్రహ్మేశ్వరరావు, రేపల్లె సులోచనమ్మ దంపతుల కుమారుడు రేపల్లె కల్యాణ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. కోడుమూరు ఫైర్ స్టేషన్‌లో తండ్రి హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ప్రాథమిక విద్య కోడుమూరు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గోరంట్ల రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివాడు. ఇంటర్మీడియట్ చిన్నటేకూరు సోషల్ వెల్ఫేర్ కాలేజీలో చదివి డిగ్రీ సిల్వర్‌జూబ్లీ కాలేజ్‌లో అభ్యసించాడు. మొదటి ప్రయత్నంలోనే ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా 2020లో ఎంపికై ప్రస్తుతం పనిచేస్తున్నాడు. తాను డిగ్రీ చదువుతున్న సమయంలో ఎన్‌సీసీలో చేరడం, అక్కడ ఇచ్చే శిక్షణ తనలో స్ఫూర్తిని నింపడంతోనే ఈరోజు ఎస్ఐ ఉద్యోగం సాధించేందుకు కారణం అయిందని రేపల్లె కల్యాణ్ చెబుతున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో శిశువులకు ఆధునిక వైద్యం



ఎస్ఎన్‌సీయూలో శిశువులను పరిశీలిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎస్ఎన్‌సీయూలో శిశువులకు ఆధునిక వైద్యం అందుతోందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్ఆర్‌సీ), స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీయూ)లను తనిఖీ చేశారు. తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలు, మాధ్యమిక పోషకాహార లోపం ఉన్న పిల్లల గురించి ఆరా తీశారు. అక్కడ ఉన్న తల్లులతో పిల్లలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి చర్చించారు. పిల్లలకు టీకాలు సమయానుసారంగా వేయించాలని, అన్నీ ముందుగా స్టాక్ ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు.

జిల్లా జాబ్స్ మేనేజర్ కిరణ్ బదిలీ

- వెంకటరమణకు పూర్తి అదనపు బాధ్యతలు

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ–వైకేపీలో జిల్లా జాబ్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ బదిలీ అయ్యారు. ఈయనను కాకినాడుకు బదిలీ చేస్తూ సెర్ప్ సీఈవో ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం వైకేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బదిలీ అయిన జాబ్స్ మేనేజర్‌ను సత్కరించి వీడ్కోలు పలికారు. నిరుద్యోగ యువతకు స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలన మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరించారని డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ సలీమ్‌బాషా పేర్కొన్నారు. కాగా సీడాప్ సీనియర్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వెంకటరమణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు.

కొడుకు నుంచి రక్షణ కల్పించండి



రోడ్డుపై బైఠాయించిన గంగిరెడ్డి

డోన్ టౌన్: తన కుమారుడు ఆస్తి లాక్కొని ఇంటి నుంచి వెళ్లి పొమ్మంటున్నాడని, అధికారులు న్యాయం చేయాలని ఓ వ్యక్తి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన గంగిరెడ్డి, సుబ్బలక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు రవి శంకర్‌రెడ్డి తన పేరు మీద ఉన్న ఇంటిలో సగ భాగం రాయించుకుని బయటకు గెంటేస్తున్నాడని తండ్రి గంగిరెడ్డి గురువారం గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు. అధికారులు, పోలీసులకు సమస్య చెప్పినా న్యాయం జరగడం లేదని, తనకు ఆత్మహత్యే శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

గ్రూప్ 1 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వారికి గ్రూప్ –1 (ప్రిలిమినరీ) పరీక్ష రాసేందుకు స్థానిక ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ పీ వెంకటలక్షుమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ పొందే అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులైన ఉండాలని, రూ.1 లక్ష లోపు సంవత్సరాదాయం కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తుకు ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలు జత చేసి నేరుగా లేక పోస్టు ద్వారా ఈ నెల 30వ తేదీలోగా ఏపీ బీసీ స్టడీ సర్కిల్, కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, అబ్బాస్‌నగర్, కర్నూలు చిరునామాకు పంపాలన్నారు. అభ్యర్థుల ఎంపిక డిగ్రీ మెరిట్ ప్రాతిపదికన జరుగునన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత స్టడీ మెటీరియల్ ఇవ్వబడుతుందని, శిక్షణా కాలం పూర్తయిన అనంతరం అర్హులైన అభ్యర్థులకు స్టయిఫండ్ మంజూరు చేస్తామన్నారు. వివరాలకు 08518-236076ను సంప్రదించాలన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు (రాజ్‌విహార్): రాజస్థాన్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న రాజస్థాన్ వాసి జుజురాం (43) ప్రమాదవశాత్తూ రైలు నుంచి కింద పడి మృత్యువాత పడ్డాడు. గురువారం తన బంధువు దినేష్‌తో కలిసి హైదరాబాదు మీదుగా బెంగళూరుకు వెళ్తుండగా తలుపు వద్ద నులిచి ఉన్న జుజురాం వెల్దుర్తి సమీపంలోని బోగోలు స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. అతడిని కాపాడేందుకు వెంట ఉన్న బంధువు దినేష్ రైలు చైన్ లాగి నిలిపాడు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు.

కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటాలుకు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	5,509	7,909
పొద్దుతిరుగుడు	4,019	4,129
ఆముదం	4,469	5,256
వాము	10,110	10,110
ఉల్లి	297	2,100
ఎండుమిర్చి	1,099	21,139
శనగలు	5,490	5,630
కందులు	3,800	9,300
మొక్కజొన్న	2,096	2,160
మినుములు	8,709	8,709
కొర్రలు	6,105	6,105
సోయాచిక్కుడు	3,619	3,859

కర్నూలు మార్కెట్ యార్డు ఫోన్ : 08518-257204, 257661

ఓవరాల్ చాంపియన్‌గా తిరుపతి జట్టు



సాధించిన పతకాలతో తిరుపతి ఎస్వీ కళాశాల జట్టు

మహానంది: మహానంది వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన క్రీడల్లో ఓవరాల్ చాపియన్‌షిప్‌ను తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల కైవసం చేసుకుంది. ఈనెల 19న ప్రారంభమైన అంతర్ వ్యవసాయ కళాశాలల రాష్ట్ర స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగంలో రన్నింగ్, లాంగ్ జంప్ తదితర క్రీడల్లో క్రీడాకారులు సత్తా చాటి విజేతలుగా నిలిచారు. పోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.కెఎస్ఎస్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు రైతులకు సేవ చేయడంలో పోటీ పడాలని సూచించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ముత్యాల నాయుడు, ఒంగోలు జాతి పశుపరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ధర్మారాజు, విశ్వవిద్యాలయం డీన్‌ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.సాంబశివరావు, డా.రామకృష్ణారెడ్డి, డా.పివి రమేష్‌బాబు, డా.ఎల్ విజయభాస్కర్, డా.ఎమ్ఎస్ రాహుల్, డా. గీతా శిరీష, డా. స్వరాజ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): అసంఘటిత కార్మికులకు ఉచితంగా న్యాయ సాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉందని ఆ సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు అన్నారు. గురువారం సంస్థ కార్యాలయంలో అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కార్మికుడు ఈ–శ్రమ్, పీఎం ఎస్‌వైఎం కార్డును తీసుకోవాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్ మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాద కేసులకు ఎలాంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించే ఉద్దేశంతో శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేశారన్నారు. జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టి.శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులందరికీ ఇళ్ల నిర్మాణం



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఇల్లు లేని చెంచుగిరిజన కుటుంబాలకు నూతనంగా ఇళ్లను నిర్మించబోతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ అధికారులతో పీఓ సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయమహాఅభియాన్ కింద ఒక్కొక్క గృహానికి రూ. 2.40 లక్షలు మంజూరు చేసి గృహాలు నిర్మించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గిరిజన గూడేల్లో అర్హులైన చెంచుగిరిజన కుటుంబాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రకాశం, నంద్యాల, పల్నాడు చెంచుగిరిజన గూడాల్లో ఇప్పటికే 5,804 గృహాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో నంద్యాల హౌసింగ్ డీఈ సుక్కేరెడ్డి, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, ప్రత్యేకాధికారి ధనుంజయ, ఏపీడీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- బెటాలియన్స్ డీఐజీ వెంకటేశ్వర్లు



బెలూన్స్ ఎగురవేసి స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న బెటాలియన్స్ డీఐజీ వెంకటేశ్వర్లు

కర్నూలు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఏపీఎస్పీ బెటాలియన్స్ మూడో రేంజ్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. కర్నూలు రెండవ బెటాలియన్‌లో 6వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2023 కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. గురువారం ప్రారంభ కార్యక్రమానికి డీఐజీ వెంకటేశ్వర్లు, సదరన్ రీజియన్ హోం గార్డ్స్ కమాండెంట్ మేకల మహేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రెండో బెటాలియన్ కమాండెంట్ పి.రవిశంకర్, ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ రవికిరణ్, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ఎం బాషా, డీఎస్పీ భక్తవత్సలం తదితరులు పూలబొకే ఇచ్చి అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాంతికి చిహ్నమైన పావురాలను ఎగురవేసి ఆన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఐజీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పటాలంలో పనిచేస్తున్న సిబ్బంది నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తూ తీరిక లేకుండా శ్రమిస్తున్నందున ప్రతి ఏటా సిబ్బందికి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్, పటాలం రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుదారులకు టోకరా

- రికవరీ ఏజెంట్‌నంటూ రూ. 6 లక్షలు వసూలు చేసి పరారీ



వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ రఘువీర్

బొమ్మలసత్రం: ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు బిల్లు రికవరీ పేరుతో ఉమ్మడి జిల్లాలో 19 మంది కస్టమర్ల నుంచి రూ.6 లక్షలు వసూలు చేసి పరారైన సంఘటన గురువారం కలకలం రేపింది. ట్రైనీ డీఎస్పీ రఘువీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన వసీమ్ అలీబేగ్ అనే వ్యక్తి కొంత కాలం క్రితం నంద్యాల ఎస్‌బీఐ బ్యాంకులో క్రెడిట్ కార్డ్ రీకవరీ ఏజెంట్‌గా పనిచేశాడు. కాగా కస్టమర్ల క్రెడిట్ కార్డు బిల్లులు తన సొంత అవసరాలకు వాడుకోవటంతో బ్యాంక్ అధికారులు అతన్ని విధుల నుంచి తొలగించారు. అయినప్పటికీ తాను ఇంకా రీకవరీ ఏజెంట్‌గా ఉద్యోగంలో ఉన్నానని చెప్పి ఉమ్మడి జిల్లాలో ఉన్న 19 మంది కస్టమర్ల నుంచి రూ.6 లక్షల దాకా వసూలు చేశాడు. కాగా వారి వద్దకు రికవరీ కోసం వెళ్లిన బ్యాంక్ సిబ్బందికి క్రెడిట్ కార్డు బకాయి నగదును వసీమ్ అలీ బేగ్ అనే వ్యక్తికి చెల్లించామని చెప్పడంతో అధికారులు కంగుతిన్నారు. నిందితుని ఇంటి వద్దకు వెళితే ఇంటికి తాళం వేసి పరారయ్యారని గుర్తించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితునిపై గురువారం చీటింగ్ కేసు నమోదు చేసి గాలిస్తున్నామని ట్రైనీ డీఎస్పీ వివరించారు. ఎవరైనా బ్యాంక్ సిబ్బంది పేరుతో ఫోన్ చేసి బకాయిలు కట్టాలని అడిగితే బ్యాంక్‌కు వెళ్లి సదరు వ్యక్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే బకాయిలు చెల్లించాలని కోరారు.